

కేబుల్ వైర్లను తొలగించక ముందు



కేబుల్ వైర్లను తొలగించిన తర్వాత

రహదారిపై కేబుల్ వైర్ల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చంపాపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'ట్రాన్స్‌కో జర చూసుకో!' అనే శీర్షికతో ఈ నెల 9న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చంపాపేట చౌరస్తాలో ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా కత్తరించి ఉన్న కేబుల్ వైర్లను సోమవారం జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది తొలగించారు. కేబుల్ వైర్లను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మలక్‌పేట కాంగ్రెస్ ఇన్‌చార్జి షేక్ అక్బర్ తదితరులు - చాదర్‌ఘాట్, నవబరు 10(ఆంధ్రజ్యోతి)



బడంగ్‌పేట్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న ఏజీఆర్ కాలనీవాసులు

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

సరూర్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తమ కాలనీని దాదాపు ఏడాది కాలంగా పట్టి పీడిస్తున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 30వ డివిజన్ పరిధిలో గల ఏజీఆర్ కాలనీవాసులు ఆందోళనకు దిగారు. ఇటీవల ఇదే సమస్యపై బీజేపీ నేతలు సైతం కాలనీవాసులతో కలిసి ధర్నా నిర్వహించిన సంగతి విదితమే. కాగా, అప్పట్లో ఎమ్మెల్యే సబితారెడ్డి కాలనీని సందర్శించి వెంటనే సమస్యను పరిష్కరించాలని మునిసిపల్ కమిషనర్ సరస్వతిని, ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ సమస్య అలాగే కొనసాగుతోంది. దాంతో ఏజీఆర్ కాలనీవాసులు మరోసారి రోడ్డెక్కారు. సోమవారం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానికులు నల్ల కండువాలు వేసుకుని బడంగ్‌పేట్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కార్యాలయం ఎదుట సైతం ఆందోళన నిర్వహించారు. ఈ సమస్య రెండు డివిజన్లలోని సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో ఆయా డివిజన్ల మాజీ కార్పొరేటర్లు సోమవారం అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పరస్పర సహకారంతో సమస్యను పరిష్కరించాలని, అధికారులు రెండు డివిజన్లకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలని వారు సూచించారు.

సీపీఐ నేత దేవయ్య కన్నుమూత

● నివాళులర్పించిన నేతలు



దేవయ్య(ఫైల్)

ఎల్బీనగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్బీనగర్ మాజీ కార్యదర్శి నాగిళ్ల దేవయ్య గుండెపోటుతో కర్మన్‌ఘాట్‌లోని తన నివాసంలో సోమవారం మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. దశాబ్దాల పాటు కమ్యూనిస్టు పార్టీకి సేవలందించిన ఆయన వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా కొంతకాలం నుంచి పార్టీలో క్రియాశీలకంగా కొనసాగడంలేదు. పలువురు కమ్యూనిస్టు నేతలు దేవయ్య పార్థివ దేహంపై అరుణపతాకాన్ని ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి దేవయ్య పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేవయ్య కమ్యూనిస్టు పార్టీకి దశాబ్దాల కాలం పాటు సేవలందించారని తెలిపారు. ఆయన అకాల మరణం పార్టీకి తీరనిలోటని ఆయన అన్నారు. దేవయ్యకు నివాళులర్పించిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నరసింహ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు అందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు యాదిరెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గం కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, ఏఐటీయూసీ అధ్యక్షుడు బోయపల్లి రాములు, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి హరిసింగ్ నాయక్, ఛాయాదేవి, కమలమ్మ, వెంకటేష్, నాగరాజు, భూషణ్, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.



నాగిళ్ల దేవయ్య పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి ఇతర నేతలు

కుంట్లూర్‌లో చైన్ స్నాచింగ్

● వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగులు

హయత్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు కూర్చున వృద్ధురాలి మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుంట్లూర్ ఇష్టకామేశ్వరీ దేవాలయం సమీపంలో నివాసం ఉండే కరికాల ముత్తమ్మ(70) సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటి ముందు కూర్చి వేసుకుని కూర్చుంది. అదే సమయంలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు బైకుపైన వచ్చి ముత్తమ్మ మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. బాధితురాలు వెంటనే హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు గుడిసెలు దగ్ధం

● సాయిలు హట్స్‌లో ఘటన ● ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణ నష్టం



గుడిసె కాలిపోవడంతో విలపిస్తున్న పుష్ప, అబ్బయ్య దంపతులు

చాదర్‌ఘాట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శాలివాహననగర్ కాలనీలోని సాయిలు హట్స్‌లో గల మూడు గుడిసెలు పూర్తిగా, ఒక గుడిసె పాక్షికంగా దగ్ధమయ్యాయి. ప్రమాద సమయంలో ఆ గుడిసెల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదని బస్తీవాసులు తెలిపారు. సాయిలు హట్స్‌లోని ప్రత్యక్షసాక్షులు, మలక్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శాలివాహననగర్ కాలనీలో మూసీ పరీవాహక ప్రాంతంలో సాయిలు హట్స్‌లో సుమారు 34 మంది గుడిసెవాసులు నివాసముంటున్నారు. వీరిలో కొన్ని గుడిసెలను ఆర్‌బీ ఎక్స్‌గా (మూసీ గర్భంలోని నివాసాలుగా) గుర్తించి నగర శివారులోని పలు ప్రాంతాల్లో కొందరికి తెలంగాణ ప్రభుత్వం ఇళ్లను కేటాయించింది. మిగతా 34 మంది గుడిసెవాసులకు డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపు పెండింగ్‌లో ఉండడంతో వారు గుడిసెల్లో నివాసముంటున్నారు. ఇందులోనే ఓ గుడిసెలో బండ అబ్బయ్య, పుష్ప దంపతులు నలుగురు పిల్లలతో నివాసముంటున్నారు. బంధువుల ఇంట్లో శుభకార్యానికి అబ్బయ్య, పుష్ప కుటుంబీకులు వెళ్లారు. సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో వీరి గుడిసెకు నిప్పు అంటుకుంది. స్థానిక గుడిసెవాసులు తేరుకునే లోపే గుడిసె పైకప్పు పూర్తిగా కాలిపోయింది. ఈ గుడిసెకు ఆనుకుని ఉన్న మరో రెండు గుడిసెలు కూడా కాలిపోయాయి. విషయం తెలియగానే మలక్‌పేట పోలీసులు, అగ్నిమాపక దళం రంగంలోకి దిగి మంటలను అదుపు చేశారు. ఈ గుడిసెల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న బాధితులు అబ్బయ్య, పుష్ప దంపతులు, నవనీత, మార్తమ్మ కుటుంబీకులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. కట్టు బట్టలు మినహా అన్నీ కాలిపోయాయంటూ బోరున విలపించారు. వెనుకవైపు ఉన్న పవన్, మేఘన గుడిసె పై కప్పు కాలిపోయింది.



సాయిలు హట్స్‌లో కాలిపోతున్న గుడిసెలు

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీసీపీ



కాలిన గుడిసెలను పరిశీలిస్తున్న డీసీపీ అలోక్ అజయ్‌కుమార్, ఏసీపీ ఠాకూర్ సుఖ్‌దేవ్‌సింగ్

శాలివాహననగర్ కాలనీలోని సాయిలు హట్స్‌లోని మూడు గుడిసెలు పూర్తిగా మరో గుడిసె పాక్షికంగా అగ్నిప్రమాదానికి గురైనట్లు సమాచారం తెలుసుకున్న సీపీసీ డీసీపీ అలోక్ జయ్‌కుమార్, సంతోష్‌నగర్ ఏసీపీ ఠాకూర్ సుఖ్‌దేవ్‌సింగ్ తోపాటు మలక్‌పేట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనకు గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

వివరాలు సేకరించిన తహసీల్దార్



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న సైదాబాద్ తహసీల్దార్ శ్రీదేవి

సైదాబాద్ తహసీల్దార్ శ్రీదేవి తన సిబ్బందితో సాయిలు హట్స్‌లోని ఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, వివరాలు సేకరించారు. ప్రభుత్వం తరపున అందాల్సిన సహాయం గురించి కలెక్టర్‌కు నివేదిస్తానని ఆమె తెలిపారు.

జనన, మరణ ధ్రువపత్రాల జారీలో జాప్యం

● సర్కిల్ కార్యాలయంలో బైఠాయించిన కార్పొరేటర్

ఎల్బీనగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్రజాప్యం, అధికారుల అలసత్వంపై కొత్తపేట కార్పొరేటర్ నయకోటి పవన్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తుదారులను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా త్వరగా ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలంటూ సోమవారం సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో బాధితులతో కలిసి ఆయన బైఠాయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కొందరు అధికారులు, సిబ్బంది అవినీతి, అక్రమాలకు అలవాటు పడి ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించడంలో అలసత్వం వహిస్తు దరఖాస్తుదారులను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆరోపించారు. తమను కలిసిన వారి వద్ద అందినంతా దండుకుని వారి పనులను అధికారులు, సిబ్బంది త్వరగా చేస్తున్నారని అన్నారు. ధ్రువీకరణ పత్రాల జారీలో అలసత్వం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక నుంచి జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చూస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో కార్పొరేటర్ శాంతించారు.



సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

మురుగునీటితో నిండిన కుమ్మరికుంటను ఖాళీ చేయండి

హయత్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని కుమ్మరికుంటలో చేరిన మురుగునీటిని ఖాళీ చేయాలని వస్పరి కాలనీ, శాంతినగర్, రామకృష్ణానగర్, సాయినగర్, మైత్రి విల్లాస్ కాలనీలకు చెందిన ప్రజలు డిమాండ్ చేశారు. కుమ్మరికుంటలోని మురుగునీటి వల్ల వస్తున్న దుర్వాసనతో ఇండ్లలో ఉండలేక పోతున్నామంటూ సోమవారం హయత్‌నగర్‌లోని జలమండలి డివిజన్-11 ఆపరేషన్-మెయింటనెన్స్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఐదు కాలనీలకు చెందిన ప్రజలు కలిసి ధర్నా నిర్వహించారు. కుమ్మరికుంట చెరువులో చేరిన మురుగునీటిని తొలగించాలని, అందులోనికి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు అక్కడే ఉన్న కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీదేవితో వాగ్వాదానికి దిగారు. అనంతరం వినతి పత్రం సమర్పించారు. ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వడానికి కార్యాలయానికి వెళ్లగా జీఎం మహేందర్‌నాయక్ కుర్చిలో లేక పోవడంతో ఖాళీ కుర్చికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. కాలనీ వాసులు చేస్తున్న ధర్నాకు హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మురుగునీటితో నిండిన కుమ్మరికుంటను ఖాళీ చేయించాలని వస్పరికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు వస్పరి జంగయ్య డిమాండ్ చేశారు. లేదంటే హయత్‌నగర్ చుట్టు పక్కల కాలనీ వాసులందరితో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీలకు చెందిన సంక్షేమ సంఘం నాయకులు జనార్దన్‌రెడ్డి, జంగయ్య, బాల్‌రెడ్డి, శర్మ, ప్రేమ్‌నాథ్, గోపాల్‌రెడ్డి, దాసుగౌడ్, జంగారెడ్డి, సోఫీతో పాటు పలువురు పాల్గొన్నారు.



జలమండలి-11 కార్యాలయంలోని సూపరింటెండెంటుకు వినతి పత్రం ఇస్తున్న వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు



చిన్నారులకు సైనేజీ బోర్డులపై నిబంధనలు వివరిస్తున్న టీటీఐ అధికారులు

విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకోవాలి

కొత్తపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటే నుంచే ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి సూచించారు. సోమవారం హయత్‌నగర్ తొర్రూరు, అల్కాపురి ప్రైవేటు స్కూల్స్ నుంచి 70 మంది చిన్నారి విద్యార్థులు ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. సిబ్బంది రమేష్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ పిల్లలందరికీ పార్కులో ఉన్న ట్రాఫిక్ నిబంధనల రంగురంగుల పోస్టర్లు, టాఫిక్ సూచికలనూ చూపుతూ వివరించారు. విద్యార్థులకు సీటు బెల్టు, హెల్మెట్ ప్రాధాన్యతను వివరించారు.

టీటీఐ ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ నర్సింహారావుతో కలిసి రాచకొండ పరిధిలోని 10 ప్రాంతాల్లో 596 మంది వాహనదారులకు, విద్యార్థులకూ నిబంధనలపై 17 కార్యక్రమాల్లో అవగాహన కల్పించారు.

54 మంది మద్యం ప్రియులకు కౌన్సెలింగ్

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి, ఎస్పీటీ అమరవర్ధన్‌రెడ్డి సూచించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిలో 54 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సోమవారం టీటీఐ లెక్చర్‌హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు.



నాగదేవత విగ్రహం తొలగించేందుకు వచ్చిన కూలీలు

లక్ష్మీగణపతి కాలనీలో నాగదేవత విగ్రహం తొలగింపు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారం లక్ష్మీగణపతి కాలనీలో నాగదేవత విగ్రహం తొలగింపుపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 76లో 8 ఏళ్ల క్రితం కాలనీవాసులు హనుమాన్ ఆలయం సమీపంలో నాగదేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కొంత కాలంగా విగ్రహం ప్రతిష్ఠించిన స్థల విషయంలో ఆ స్థల యజమానితో పాటు కాలనీవాసులకు మధ్య వివాదం కొనసాగుతోంది. కాగా, సోమవారం సదరు భూ యజమాని కూలీలతో ఆ విగ్రహాన్ని తొలగించారు. దీంతో కాలనీవాసులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కాలనీ వాసులు తెలిపారు.



మధుసూదనాచారిని సన్మానిస్తున్న మారోజు జంగాచారి తదితరులు

రంగారెడ్డి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా జంగాచారి

చంపాపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా స్వర్ణకార సంఘం నూతన అధ్యక్షుడిగా చంపాపేట డివిజన్‌కు చెందిన మారోజు జంగాచారి, ప్రధాన కార్యదర్శిగా ఎం.సంతోష్‌కుమార్‌చారి, కోశాధికారిగా కొండోజు సునీల్‌చారి ఎన్నికయ్యారు. డివిజన్‌లోని మందమల్లమ్మ చౌరస్తా రోడ్‌లోని శ్రీలక్ష్మి కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించిన సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసెంబ్లీ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే అనిల్, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి, అఖిల భారత స్వర్ణకార సంఘం అడిషనల్ జనరల్ సెక్రెటరీ రాగిఫణి రవీంద్రాచారి హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. నూతన కార్యవర్గం సంఘం అభివృద్ధికి కృషి చేయాలని మధుసూదనాచారి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షుడు మహేశ్వరం జగదీశ్వరాచారి, స్వర్ణకార సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామదాసు లక్ష్మణాచారి, బొడ్డుపల్లి రవి ప్రశాంత్, 33 జిల్లాల సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించడానికి మాలధారణ

వనస్థలిపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): భక్తిభావం పెంపొందించడానికి మాలధారణ ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌లోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శ్రీ మల్లిఖార్జున భక్త సమాజం అధ్యక్షుడు ముద్దగౌని సతీష్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మాలధారణ స్వాములకు అన్నాదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదనాచారి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వాణీదేవి తదితరులు

బడంగ్‌పేట్‌లో కార్తీక వన సమారాధన

సరూర్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ నగర బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడి శ్రీ కాశీబుగ్గ క్షేత్రంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. బ్రాహ్మణ కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం సామూహిక వన భోజనాలు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పవిత్ర కార్తీక మాసంలో నిర్వహించుకునే వన సమారాధనతో బ్రాహ్మణ కుటుంబాల్లో ఐక్యత పెరుగుతుందని, దీనిని నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య అధ్యక్షుడు మోత్కూరి రామేశ్వరరావు, మంగపతిరావు, జగన్‌మోహన్‌శర్మ, జానకీరామారావు, బడంగ్‌పేట్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మంగు రాఘవరావు, గౌరవాధ్యక్షులు తుంగతుర్తి మోహన్‌రావు, చక్రవర్తుల మదన్‌మోహనాచార్యులు, సంఘం ప్రతినిధులు అనురాధ, రాంబాబు, కవిత, నవీన్‌కుమార్, మైథిలి, మాధురి, సుధారాణి, నరేందర్, శ్రీరామ్మూర్తి, శంకర్‌రావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం

చంపాపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో సోమవారం శ్రీ ధ్యానాంజనేయస్వామి భజన బృందం నిర్వాహకులు ఆనంద్, లత దంపతులు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం, లక్ష తమలపాకులతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, ధర్మకర్తలు కొండ్ర సంతోష్‌కుమార్, తోకటి కిరణకుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు బాధితులకు అప్పగింత



బ్యాగును బాధితులకు అప్పగిస్తున్న హయత్‌నగర్ క్రైం సీఐ సంతోష్‌కుమార్

హయత్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న బ్యాగును సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వెతికి పట్టుకున్న హయత్‌నగర్ క్రైం పోలీసులు బాధితులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఇనాంగూడకు చెందిన వనం ప్రకాష్‌గౌడ్ సోమవారం ఉదయం తన తల్లితో పాటు బైకుపై హయత్‌నగర్ వైపునకు వెళ్తుండగా దారి మధ్యలో బ్యాగు కనిపించలేదు. దీంతో వెంటనే హయత్‌నగర్ క్రై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాగులో సెల్ ఫోన్‌తో పాటు ఒక తులం విలువ చేసే రెండు బంగారు గొలుసులు ఉన్నట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. వెంటనే క్రైం సీఐ సంతోష్‌కుమార్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సెల్ ఫోన్ సిగ్నల్స్‌ను ట్రేస్ చేశారు. సిగ్నల్ ఆధారంగా పోలీసులు వెళ్లగా సెల్ ఫోన్ ఇనాంగూడ్ ఎక్స్‌రోడ్డు వద్ద గల డివైడర్‌పైన గడ్డిలో పడిఉంది. వెంటనే బ్యాగును స్వాధీనం చేసుకున్న పోలీసులు బాధితుడిని పిలిచి నగలు, సెల్ ఫోన్‌ను అప్పగించారు. దీంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైం ఏఎస్ఐ వెంటారెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో 'చెత్త' నిర్వహణ

● పెద్దఅంబర్‌పేట్‌లో ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు
● శానిటేషన్ విభాగం అధికారుల నిర్లక్ష్యం
● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. శానిటేషన్ విభాగం అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. పలు కాలనీల వాసులు ఇంట్లోని చెత్తను కవర్లలో చుట్టి రోడ్డు పక్కన పారవేస్తున్నారు. రోజూ వారీగా చెత్తను తొలగించాల్సిన సిబ్బంది పట్టించుకోకపోవడంతో అక్కడే చెత్త పేరుకుపోతోంది. రోజుల తరబడి చెత్తను తొలగించకపోవడంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వెలువడుతోంది. పందులు, కుక్కలు చెత్త కుప్పల్లో స్వైర విహారం చేసున్నాయి. దీంతో ప్లాస్టిక్ కవర్లతో పాటు వ్యర్థాలు రోడ్డుపైకి వస్తున్నాయి. ప్లాస్టిక్ నిషేధం అమలు, చెత్త నిర్వహణలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని పలు కాలనీల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో సమస్యలను పట్టించుకునే నాథుడేకరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పారిశుధ్య నిర్వహనపై మున్సిపల్, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



కుంట్లూర్ తెలంగాణ నగర్ కాలనీ ఎదురుగా రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త కుప్ప, దాంట్లోనే సేదతీరుతున్న మేకలు



పెద్దఅంబర్‌పేట్ సాయికుటీర్ కాలనీకి వెళ్లే రోడ్డులో చెత్త వ్యర్థాల కవర్లు



విజయవాడ జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో ఇలా



కుంట్లూర్ అయోమ స్కూల్ సమీపంలో రోడ్డు పక్కన చెత్త కుప్ప